క్లుప్తంగా

ప్రజలందరికీ కృతజ్ఞతలు

- వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి దీపిక



హిందూపురం: నియోజక వర్గ ప్రజలందరూ తనపై చూపించిన అభిమానం, ప్రేమానురాగాలకు హృదయ పూర్వక ధన్యవాదాలు తెలియజేస్తున్నానని హిందూపురం అసెంబ్లీ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి టీఎస్.దీపిక అన్నారు. హిందూపురం నియోజకవర్గంలో గడప గడపకూ కార్యక్రమం నుంచి ఇతర సేవ, అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తున్నప్పటి నుంచి నేటి వరకు ప్రజలు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు చూపుతున్న ఆదరాభిమానాలకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని చెప్పారు. ఎమ్మెల్యే అభ్యర్థిగా నిలబడిన తనకు ఓట్లు వేసిన వారందరికీ రుణపడి ఉంటానని పేర్కొన్నారు. తన గెలుపే ధ్యేయంగా వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ఎంతో శ్రమించారని, వారి మేలును ఎన్నటికీ మరువనన్నారు. ముఖ్యంగా సజావుగా ఎన్నికల ఘట్టం ముగిసేలా కృషిచేసిన ఎన్నికల అధికారులు, సిబ్బంది, పోలీసు అధికారులకు అలాగే ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులకు హృదయ పూర్వక ధన్యవాదలు తెలియజేస్తున్నానని చెప్పారు.

స్ట్రాంగ్ రూములకు సీలు



స్ట్రాంగ్ రూముకు సీలు వేస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

లేపాక్షి: మండలంలోని చోళసముద్రం సమీపంలో ఉన్న బీఆర్.అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూముకు జనరల్ అబ్జర్వర్ రామచంద్రతివారి, అన్పుక్‌కుమార్, ఆర్వోలు వెంకటశివపసాయిరెడ్డి, భాగ్యరేఖతో పాటు వివిధ రాజకీయ పార్టీ ప్రజాప్రతినిధుల సమక్షంలో మంగళవారం ఉదయం సీలు వేశారు. ధర్మవరం, పుట్టపర్తి శాసనసభకు సంబంధించిన ఈవీఎం బ్యాలెట్ బాక్సులను భద్రపరచిన గదులను వారు పరిశీలించారు.

ఇంటర్ అడ్మిషన్లు ప్రారంభం

పెనుకొండ: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని ప్రిన్సిపాల్ సుదర్శన్ తెలిపారు. కళాశాలలో జనరల్ విభాగంలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్ఈసీ, వృత్తి విద్యా విభాగంలో ఎంఎల్‌టీ, ఏటీ, సీఎస్ఈ, ఎంపీహెచ్‌డబ్ల్యూ, సెరికల్చర్ తెలుగు, ఇంగ్లిష్ మీడియంలో ఉన్నాయన్నారు. పదో తరగతి పాసైన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాలని సూచించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు



గాయపడిన తిమ్మప్ప

రొళ్ల: వెనక భాగం నుంచి ద్విచక్ర వాహనంలో వచ్చి ఢీకొట్టిన ఘటనలో తిమ్మప్ప అనే వ్యక్తి తీవ్రంగా గాయపడ్డారు. స్థానికుల వివరాలమేరకు... మంగళవారం రొళ్ల మండలం టీడీపల్లికి చెందిన తిమ్మప్ప పని నిమిత్తం కర్ణాటక రాష్ట్రం శిర పట్టణానికి ద్విచక్ర వాహనంలో బయలు దేరాడు. అగళి మండలం ఇరిగేపల్లి గ్రామ సమీపాన జాతీయ రహదారిపై వెళుతుండగా వెనక భాగం నుంచి అనంతపురం చెందిన గుర్తు తెలియని వ్యక్తి ద్విచక్ర వాహనంలో వచ్చి ఢీకొట్టాడు. తిమ్మప్ప అదుపుతప్పి రోడ్డుపై పడడంతో సుమారు 10 మీటర్ల దూరం వరకూ తారు రోడ్డుపై రాసుకుని పోవడంతో కాళ్లు, చేతులు, ముఖం ఇతరాత్ర చోట్ల తీవ్ర గాయాలు అయ్యాయి. వెంటనే స్థానికులు రామనపల్లి చెందిన విశ్రాంత హెచ్ఎం గోవిందప్ప కుమారుడు ఉపాధ్యాయుడు రవీంద్రమూర్తి సహాయంతో కారులో రొళ్ల సీహెచ్‌సీకి తరలించి ప్రథమ చికిత్సలు అందించారు. తర్వాత ఆరోగ్యంగా ఉండటంతో అదే కారులో స్వగ్రామానికి తరలించారు.

రుణాలు రెన్యూవల్ చేసుకోండి

అమరాపురం: స్థానిక కెనరా బ్యాంకులో పంట రుణాలు తీసుకున్న రైతులు తమ రుణాలను రెన్యూవల్ చేసుకోవాలని బ్యాంకు మేనేజర్ ప్రహ్లాద తెలిపారు. ఈ ఏడాదికి రైతులు తాము తీసుకున్న రుణాలకు వడ్డీ మాత్రమే చెల్లించి రుణాలను రెన్యూవల్ చేసుకోవాలని సూచించారు. పట్టాదారు పాసు పుస్తకం, ఆధార్ కార్డు, ఫోటో, రెన్యూవల్ ఫారంతో పాటు వడ్డీ చెల్లించాల్సి ఉంటుందన్నారు. ప్రస్తుతం రుణాలను రెన్యూవల్ చేస్తున్నామని ఆయా గ్రామాల రైతులు రెన్యూవల్ చేసుకోవాలన్నారు.

సోమందేపల్లిలో చోరీ

సోమందేపల్లి: స్థానిక వైఎస్సార్ సర్కిల్ సమీపంలోని రామాంజినేయులు అనే వ్యక్తి నివాసంలో మంగళవారం పట్టపగలే చోరీ జరిగిన సంఘటన చోటు చేసుకుంది. ఇంటికి తాళం వేసి రామాంజినేయులు కుటుంబ సభ్యులు బయటకు వెళ్లారు. ఆ సమయంలోనే దొంగలు చొరబడి రూ.10 వేల నగదుతో పాటు రూ. 15 వేలు విలువ చేసే బంగారు కమ్మలు ఎత్తుకెళ్లారు. రెండు వారాల క్రితం కూడా ఇక్కడే ఓ ఇంట్లో చోరీకి దొంగల విఫలయత్నం చేశారు. బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.



మడకశిరలో పోలింగ్ కేంద్రాల వద్ద క్యూ కట్టిన ఓటర్లు (ఫైల్)



పెనుకొండలో ఓటు వేయడానికి క్యూలో నిలుచున్న మహిళా ఓటర్లు (ఫైల్)

ఓటెత్తిన జనం

- ఎన్నికల్లో భారీగా నమోదైన పోలింగ్ శాతం
- మడకశిరలో 87.5, పెనుకొండలో 86.96, హిందూపురం 77.81 శాతం నమోదు
- పలు చోట్ల వందశాతం పోలింగ్ నమోదు

మడకశిర: నియోజకవర్గంలో సోమవారం జరిగిన పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికల్లో భారీ పోలింగ్ నమోదైంది. ఈ ఎన్నికల్లో 87.5 శాతం పోలింగ్ నమోదు అయినట్లు ఆర్ఓ గౌరీశంకర్‌రావు తెలిపారు.

ఓటేసిన 1,84,524 మంది ఓటర్లు

నియోజకవర్గంలో మొత్తం 2,10,804 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో పురుష ఓటర్లు 1,05,760, మహిళా ఓటర్లు 1,05,043 మంది ఉన్నారు. ఈ ఎన్నికల్లో మొత్తం 1,84,524 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఇందులో పురుష ఓటర్లు 93,487, మహిళా ఓటర్లు 91,037 మంది తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు.

రెండు పోలింగ్ కేంద్రాల్లో వంద శాతం

నియోజకవర్గంలోని రెండు పోలింగ్ కేంద్రాల్లో వంద శాతం పోలింగ్ నమోదైంది. రొళ్ల మండలంలోని గుడ్డగుర్కి 120వ పోలింగ్ కేంద్రంలో వంద శాతం పోలింగ్ నమోదైంది. ఈ పోలింగ్ కేంద్రంలో మొత్తం 891 ఓటర్లు ఉన్నారు. ఇందులో పురుష ఓటర్లు 459, మహిళా ఓటర్లు 432 మంది ఉన్నారు. వీరందరూ తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. అలాగే మడకశిర మండలంలోని బుళ్లసముద్రం 180వ పోలింగ్ కేంద్రంలో కూడా వంద శాతం పోలింగ్ నమోదైంది. ఈ పోలింగ్ కేంద్రంలో మొత్తం 628 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో పురుష ఓటర్లు 318, మహిళా ఓటర్లు 310 మంది ఉన్నారు. వీరంతా పూర్తిస్థాయిలో ఓటు హక్కు వినియోగించుకున్నారు.

85 చోట్ల 90 శాతానికిపైగా పోలింగ్

నియోజకవర్గంలో 237 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. ఇందులో 85 పోలింగ్ కేంద్రాల్లో 90 శాతానికి పైగా పోలింగ్ నమోదు కావడం విశేషం. ఇదిలా ఉండగా అత్యధికంగా మడకశిర మండలంలోని హెచ్‌ఆర్‌పాళ్యం 165వ పోలింగ్ కేంద్రంలో 96.1 శాతం, అమరాపురం మండలంలోని కనకనహళ్లి 46వ పోలింగ్ కేంద్రంలో 96 శాతం పోలింగ్ నమోదైనట్లు అధికారులు తెలిపారు. అత్యల్పంగా మడకశిర పట్టణంలోని 194వ పోలింగ్ కేంద్రంలో కేవలం 69 శాతం పోలింగ్ నమోదైంది. అదే విధంగా 15 పోలింగ్ కేంద్రాల్లో 70 శాతానికి పైగా ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

ప్రభుత్వంపై సానుకూలతోనే ...

మడకశిర నియోజకవర్గం పూర్తిగా కర్ణాటక సరిహద్దుకు ఆనుకొని ఉంది. నాలుగు దిక్కులూ కర్ణాటక సరిహద్దు ఉండడంతో ఈ నియోజకవర్గంలో విభిన్న సంస్కృతి ఉంది. ప్రధానంగా రైతులు, పేదలు ఇక్కడ ఎక్కువగా ఉన్నారు. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అమలు చేసిన సంక్షేమ పథకాల ప్రభావం పెద్ద ఎత్తున ఉందని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. ప్రభుత్వంపై సానుకూలత అధికంగా ఉండటం ఫలితంగానే ఓటర్లు ఉప్పెనలా తరలి వచ్చి ఓటేశారంటున్నారు. ముఖ్యంగా మహిళలు, బీసీలు, ఎస్సీలు, ఎస్టీలు, మైనార్టీలు పెద్ద ఎత్తున తరలివచ్చి ఓటు వేశారు.

పెనుకొండలోనూ పెరిగిన ఓటింగ్ శాతం

పెనుకొండ: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో సోమవారం జరిగిన పోలింగ్‌లో ఓటింగ్ శాతం భారీగా పెరిగింది. పెనుకొండ నియోజకవర్గంలో 2019లో 2,20,383 ఓట్లు ఉండగా 79 శాతం ఓటింగ్ జరిగింది. తాజాగా నియోజకవర్గంలో 2,33,682 ఓటర్లు ఉండగా 86.96 శాతంగా నమోదైంది. 2019 ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా బరిలో నిలిచిన మాలగుండ్ల శంకరనారాయణకు 96, 607 ఓట్లు రాగా ఓటింగ్ శాతం 51.08 శాతంగా నమోదైంది. టీడీపీ తరఫున బరిలో నిలిచిన బీకే.పార్థసారథికి 43.12 ఓటింగ్ శాతం నమోదైంది. శంకరనారాయణ 15,058 ఓట్ల తేడాతో ఎమ్మెల్యేగా విజయం సాధించారు.

సంక్షేమ పథకాలతోనే...

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలోని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పెద్ద ఎత్తున సంక్షేమ పథకాలను అర్హులందరికీ అందించింది. పెనుకొండ నియోజకవర్గంలో 2.10 లక్షల మందికి వివిధ పథకాల కింద రూ. 2,520 కోట్లను నేరుగా వారి ఖాతాల్లోకే జమ చేసింది. అమ్మఒడి, జగనన్న ఇళ్లు, పింఛన్, వైఎస్సార్ చేయూత, డ్వాక్రా రుణాల మాఫీ, వడ్డీ మాఫీ, నేతన్న నేస్తం, జగనన్న విద్యాదీవెన, జగనన్న వసతి దీవెన, గోరుముద్ద, లానేస్తం వంటి ఇతర అనేక పథకాల కింద లబ్ధి చేకూర్చారు. సంక్షేమ పథకాల్లో ఎక్కువగా మహిళలకు పెద్ద పీట వేయడంతో మహిళా ఓటర్లు అధికంగా తరలివచ్చినట్లు రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు.

హిందూపురంలో 77.81 శాతం నమోదు

హిందూపురం అర్బన్: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా సోమవారం పోలింగ్ జరిగిందిన సంగతి విధితమే. పెద్ద ఎత్తున ఓటర్లు ఆయా పోలింగ్ కేంద్రాలకు తరలిరావడంతో పోలింగ్ శాతం 77.81గా నమోదైంది. కొన్ని ప్రాంతాల్లో రాత్రి 10 గంటల దాకా పోలింగ్ జరిగింది. నియోజక వర్గంలో 253 పోలింగ్ బూత్‌లలో మొత్తం 2,49,174 మంది ఓటర్లు ఉండగా అందులో 1,93,905 మంది తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఓటింగ్‌కు 55,269 మంది దూరంగా ఉన్నారు. 97,653 మంది పురుషులు, 96,246 మంది మహిళలు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. మొత్తంగా పరిశీలిస్తే 1407 మంది పురుషులు ఎక్కువగా ఎన్నికల్లో ఓటు వేశారు. ఇక ఇతరులు 2 మాత్రమే ఓటు హక్కు వినియోగించుకొన్నారు.

చోళామాంబదేవికి ప్రత్యేక పూజలు



అలంకరణలో అమ్మవారు

అమరాపురం: స్థానిక కోట వీధిలో వెలసిన చోళామాంబదేవికి మంగళవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకుడు శ్రీనివాస్ అమ్మవారికి సుప్రభాతసేవ, కుంకుమార్చన, పంచామృతాభిషేకం తదితర పూజలు చేశారు. అనంతరం అమ్మవారికి వెండి ఆభరణాలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఈ సందర్భంగా భక్తులు తెచ్చిన పూలు, కొబ్బరి కాయలతో విశేష పూజలు చేసి మహా మంగళ హారతి ఇచ్చారు. అనంతరం వచ్చిన భక్తులకు ప్రసాద వినియోగం చేశారు. వీరాపురం, పుల్లీకుంట అమరాపురం గ్రామాల్లోని భక్తులు తరలివచ్చి అమ్మవారికి మొక్కులు చెల్లించారు.

ఆటో బోల్తా - ముగ్గురికి గాయాలు

సోమందేపల్లి: మండల కేంద్రమైన సోమందేపల్లిలోని స్నేహలతనగర్ వద్ద ఆటో బోల్తా పడటంతో డ్రైవర్‌తో పాటు మరో ఇద్దరు గాయపడిన సంఘటన మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. హిందూపురం వైపు నుంచి ప్రయాణికులతో ఆటో వెళుతుండగా కుక్క అడ్డువచ్చింది. దీంతో ఆటో అదుపు తప్పి బోల్తా పడినట్లు డ్రైవర్ దాదు పోలీసులకు తెలిపాడు. గాయపడ్డ వారిని చికిత్స నిమిత్తం 108 వాహనంలో హిందూపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కల్వర్టును బాగు చేయండి



వర్షానికి కొట్టుకుపోయిన కల్వర్టు

రొళ్ల: మండల పరిధిలోని రొళ్లకొండ గ్రామ సమీపంలో మడకశిర జాతీయ రహదారి పక్కన వెలసిన ఈశ్వరుడి ఆలయానికి చేరుకొనే సీసీ రోడ్డులో ఏర్పాటు చేసి కల్వార్టు ఆదివారం రాత్రి కురిసిన భారీ వర్షానికి తెగి పోయినట్లు భక్తులు, ప్రజలు తెలిపారు. ప్రతి సోమవారం ఈశ్వరుడి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించడం జరుగుతోందన్నారు. రొళ్లకొండ, రొళ్ల పట్టణం, మారుతీ కాలనీ, రొళ్ల ఇందిరమ్మ కాలనీతో పాటు సమీపాన కొడగార్లగుట్ట చుట్టు పక్కల గ్రామాల నుంచి ఆలయానికి పెద్ద ఎత్తున భక్తులు దర్శనం కోసం వస్తుంటారన్నారు. అయితే భారీ వర్షానికి కల్వర్టు తెగిపోవడంతో భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు.

ఘనంగా భగీరథ జయంతి



పావగడ: భగీరథ జయంతిలో పాల్గొన్న ఉప్పర సంఘం నాయకులు



సోమందేపల్లి: కేక్ కట్ చేస్తున్న ఉప్పర సంఘం నాయకులు

పావగడ: ఉప్పర సామాజిక వర్గం ఆరాధ్య దైవం భగీరథ మహర్షి జయంతి వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. తాలూకా కార్యాలయంలో నిర్వహించిన జయంతి వేడుకల్లో భాగంగా తహసీల్దార్ సంతోష్ కుమార్.. భగీరథుడి చిత్రపటం వద్ద పూలమాలలు ఉంచి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ రాజగోపాల్, ఉప్పర సంఘం నాయకులు పాల్గొన్నారు.

సోమందేపల్లి: మండలంలోని కేతగాని చెరువు, సోమందేపల్లి గ్రామాల్లో మంగళవారం భగీరథ మహర్షి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భగీరథ విగ్రహం వద్ద ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కేక్ కట్ చేశారు. ఉప్పర కులస్తులందరూ భగీరథ మహర్షిను ఆదర్శంగా తీసుకోవాలని ఆ సంఘం నాయకులు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సగర కార్పొరేషన్ డైరెక్టర్ నరసింహప్ప, సింగిల్ విండో ఛైర్మన్ కొల్లప్ప, సర్పంచ్ రామాంజినేయులు తదితరులు పాల్గొన్నారు.

కొల్హాపురి మహాలక్ష్మికి పూజలు



అలంకరణలో కొల్హాపురి మహాలక్ష్మీదేవి

రొళ్ల: మండల పరిధిలోని రత్నగిరి గ్రామంలో వెలసిన కొల్హాపురి మహాలక్ష్మీదేవి ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువజామున అమ్మవారి మూల విగ్రహంతో పాటు ఉత్సవ అమ్మవారికి అభిషేకం, అంకురార్పణ, కుంకుమార్చన, తులసీ పూజ చేశారు. అనంతరం భక్తులు కానుక రూపంలో తీసుకొచ్చిన పట్టు వస్త్రాలు, వడిబియ్యం, గాజులు, పూలతో పాటు వెండి, బంగారు ఆభరణాలతో అలంకరణ చేసి మహా మంగళారతి ఇచ్చారు. విశేష పూజ రోజు కావడంతో అమ్మవారిని కొలిచే భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి దర్శించుకున్నారు. కొందరు మహిళలు ఆలయ సమీపంలోని పాలబావి వద్దకు చేరుకుని గంగ పూజను చేసి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు ఆలయ అర్చకులు తీర్థప్రసాదం అందజేశారు. పలువురు భక్తులు ఆలయ ప్రాంగణం చుట్టు పక్కల పరిసరాల్లో వంటకాలు చేసి భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో రాజవంశీకుడు రంగప్పరాజు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

ధనుంజయ, శ్రీకృష్ణకు ఘన నివాళి



సంతాప సభ నిర్వహిస్తున్న దృశ్యం

పావగడ: పట్టణ సమీపంలోని కణివేనహళ్లి గేటు వద్ద రోడ్డు ప్రమాదంలో ఇటీవల మృతి చెందిన వైస్ ప్రిన్సిపాల్ ఓ ధనుంజయ, హెచ్ఎం శ్రీకృష్ణ ఎంతో అన్యోన్యంగా కలసి మెలసి ఉండేవారు. శ్రీకృష్ణ ఎదుగుదలకు ధనుంజయ ఎంతో కృషి చేశాడు. బతుకులోనే కాకుండా చావులోనూ వారు ఒక్కటయ్యారని ఉపాధ్యాయులు తెలియజేశారు. స్థానిక గురుభవన్ ఆవరణంలో నవోదయ హాస్య కళా మండలి ఆధ్వర్యంలో మంగళవారం వారి సంతాప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు వేణుగోపాల్‌రెడ్డి, ఈరణ్ణ మాట్లాడుతూ విద్యార్థుల విద్యా ప్రగతికి వారిద్దరూ ఎంతో కృషి చేశారని కొనియాడారు. ఈ సందర్భంగా మృతుల చిత్రపటల వద్ద పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు. కసాప అధ్యక్షుడు కట్టా నరసింహమూర్తి, మండలి సభ్యులు పాతణ్ణ, సత్యనారాయణప్ప, హనుమంతరాయప్ప, నీలా నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆదమరిస్తే ముప్పే...



మూతలేని మురుగు కాలువ

పావగడ: పట్టణంలోని తాలూకా కార్యాలయం సమీపంలో 6వ వార్డులో ఉన్న పెద్ద మురుగు కాలువ మలుపు దగ్గర కాలువపై మూతలేకపోవడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో తెలీని పరిస్థితి నెలకొంది. గుంత ఉండటంతో ఆ దారిన వెళ్లే పాదచారులు, ద్విచక్ర వాహన దారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బస్టాండుకు వెళ్లడానికి సమీప దారి కావడంతో అదే దారిలో అధిక సంఖ్యలో జనం, వాహనాలు తరచూ వెళ్తుంటాయి. ఆ మలుపు దగ్గర ఇప్పటికే ఎంతో మంది వృద్ధులు, మహిళలు కిందకు పడిగాయాల పాలయ్యారు. మున్సిపల్ అధికారులకు చెప్పినా నిర్లక్ష్యం వహిస్తున్నారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వెంటనే మురుగు కాల్వపై బండలు కాకుండా శాశ్వత ప్రాతిపదికన కాంక్రీట్ స్లాబ్ వేసి ప్రజల ప్రాణాలు కాపాడాలని కోరుతున్నామన్నారు.

నేటి నుంచి లక్ష్మీచెన్నకేశవుని బ్రహ్మోత్సవాలు



ధర్మవరం అర్బన్: కోరిన కోర్కెలు తీర్చే లక్ష్మీచెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలు బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. 15న ధ్వజారోహణం, 16న ఉదయం సూర్యప్రభ వాహనం, సాయంత్రం చంద్రప్రభ వాహనంలో స్వామి ఊరేగుతారు. 17న ఉదయం సర్వభూపాల వాహనం, సాయంత్రం సింహ వాహనం, 18న ఉదయం కల్పవృక్ష వాహనం, సాయంత్రం హనుమద్వాహనం, 19న ఉదయం పల్లకీ ఉత్సవం, సాయంత్రం లక్ష్మీచెన్నకేశవస్వామి కల్యాణోత్సవం వైభవంగా నిర్వహిస్తారు. 20న ఉదయం శేష వాహనం, సాయంత్రం గజ వాహనంలో స్వామి ఉత్సవమూర్తులు ఊరేగింపు నిర్వహిస్తారు. 21న ఉదయం 7గంటలకు మడుగు తేరు(బ్రహ్మరథోత్సవం) లాగుతారు. సాయంత్రం 4 గంటలకు బ్రహ్మ రథోత్సవాన్ని లాగుతారు.

మడకశిరలో విజయం నాదే

- వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఈరలక్కప్ప



మహేంద్రప్పను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి ఈరలక్కప్ప

మడకశిర: ఎన్నికల్లో తన విజయం కోసం ఎంతో కష్టపడి పని చేసిన వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలందరికీ కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు ఎమ్మెల్యే అభ్యర్థి ఈరలక్కప్ప తెలిపారు. మూడు నెలల పాటు తనతోనే ఉండి ప్రచారాన్ని నిర్వహించారన్నారు. వారందరికీ జీవితాంతం రుణపడి ఉంటానని తెలిపారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిపించడానికి నాయకులు, కార్యకర్తలు సహకారం అందించారన్నారు. అదే విధంగా అధికారులు, పోలీసులు కూడా ఎన్నికల సందర్భంగా ప్రశాంత వాతావరణం దెబ్బతినకుండా పనిచేశారని, వారికి కూడా ఆయన ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. నియోజకవర్గంలోని ఓటర్లలో కూడా చైతన్యం రావడం ప్రజాస్వామ్య విజయమన్నారు. జిల్లాలోనే అత్యధికంగా మడకశిర ప్రజలు ఓటుహక్కును వినియోగించుకున్నందుకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈఎన్నికల్లో తాను భారీ మెజార్టీతో గెలుపొందడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. భారీగా పోలింగ్ శాతం నమోదు కావడం తనకు గెలుపునకు సంకేతమన్నారు. మహిళలు పెద్ద ఎత్తున ఓటు వేయడం కూడా వైఎస్సార్‌సీపీకి చాలా అనుకూలంగా మారిందని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అమలు చేసిన సంక్షేమ పథకాల ప్రభావంతోనే ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు పోటెత్తారని వివరించారు. వైఎస్ జగన్‌ను మరోసారి ముఖ్యమంత్రిని చేయడానికి ప్రజలు కసితో వచ్చి ఓటు వేశారన్నారు. ఎన్నికల్లో టీడీపీకి పరాభావం తప్పదని స్పష్టం చేశారు.

ఓటమి భయంతోనే టీడీపీ దాడులు

అగళి: మడకశిరలో టీడీపీ ఓడిపోతుందని గుర్తించే టీడీపీ నాయకులు వైఎస్సార్‌సీపీ నాయకులపై దాడులకు పాల్పడుతున్నారని ఎమ్మెల్యే అభ్యర్థి ఈరలక్కప్ప విమర్శించారు. సోమవారం సాయంత్రం అగళిలోని పోలింగ్ కేంద్రం వద్ద వైఎస్సార్‌సీపీ మండల జేసీఎస్ కన్వీనర్ మహేంద్రప్పపై టీడీపీ నాయకులు చేసిన దాడిని ఆయన తీవ్రంగా ఖండించారు. మంగళవారం సాయంత్రం ఎమ్మెల్యే అభ్యర్థి ఈరలక్కప్ప అగళిలో పర్యటించి మహేంద్రప్పను ఆయన ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఓటమి భయంతోనే టీడీపీ నాయకులు దాడులకు పాల్పడున్నారని, ఇలాంటి దాడులకు భయపడేదిలేదన్నారు. అనంతరం పోలింగ్ సరళిపై పోలింగ్ కేంద్రాల వారీగా నాయకులతో సమీక్షించారు. ఈరలక్కప్ప మట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలనకు మరోసారి ప్రజలు పట్టం కట్టబోతున్నారని, మడకశిరలోనూ వైఎస్సార్‌సీపీదే విజయమన్నారు. ఇప్పటికైనా టీడీపీ నాయకుల దౌర్జన్యాలు మానుకోవాలన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ స్టూడియో శ్రీనివాస్, సర్పంచు లక్ష్మమ్మ, శివకుమార్, కో ఆప్షన్ సభ్యుడు నాసిర్ నాయకులు శివన్న, రంగప్ప, రామన్న, గిరిష్‌గౌడ్, సూర్యనారాయణరెడ్డి, హనుమతరాయప్ప,తదితరులు పాల్గొన్నారు.

జగన్ మళ్లీ సీఎం కావడం ఖాయం

గుడిబండ: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా సోమవారం జరిగిన పోలింగ్‌లో ఓటు హక్కు వినియోగించుకున్న ప్రతి ఓటరుకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి జీబీ శివకుమార్, మండల కన్వీనర్ డీఎల్ యంజారేగౌడు తెలిపారు. విలువైన సమయాన్ని కేటాయించి మండు టెండను లెక్క చేయకుండా ఉదయం నుంచి సాయంత్రం 8 గంటల వరకు క్యూలైన్‌లో నిలిచి ఓటు హక్కును వినియోగించుకోవడం శుభపరిణామమన్నారు. వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఈరలక్కప్ప భారీ మెజార్టీతో విజయం సాధించడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. హిందూపురం ఎంపీ అభ్యర్థి శాంతమ్మ కూడా అదేస్థాయిలో భారీ మెజార్టీతో విజయం సాధించడంలో ఎలాంటి సందేహం లేదన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఐదేళ్ల పాలనలో అందించిన సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలే వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపిస్తాయన్నారు. జూన్ 4న వెలువడే ఫలితాల్లో వైఎస్సార్‌సీపీ అత్యధిక మెజార్టీ ఎమ్మెల్యే స్థానాలు కైవసం చేసుకుని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావడం తథ్యమన్నారు.